# ఇదీ నా విధే!

పార్కులో బెంచీమీద పడుకున్న గోపాల్‌ని ఒక్కసారిగా వైరాగ్యం కమ్ముకొచ్చింది. దాంతో పాటు మనసు గతం పొరల్లోకి చొచ్చుకుపోయి, తన జీవితపు చిట్టాలోని పేజీల్లోంచి తన తప్పుల జాబితాని తిరగెయ్యసాగింది. తిరగేసిన తరువాత కోర్టులో నిలబెట్టిన ముద్దాయిని ఎదుటి పార్టీ లాయరు నిలదీసి ప్రశ్నిస్తున్నట్లు తన మనసే తనని ప్రశ్నించసాగింది. లాయరు కయితే కావలసినన్ని అబద్ధాలు కల్పించి చెప్పి శిక్షని తప్పించు కోవచ్చు. కానీ మనసుకెలా అబద్ధం చెప్పగలడు? మనసునెలా తప్పించుకోగలడు?? పెళ్ళయ్యాకా, ఈ నాటి వరకు తన జీవితపు పుటల్లో ఒక్క పేజీకానీ, ఒక్క పేరాకానీ, కనీసం ఒక్క పంక్తిగానీ, ఆఖరికి ఒక్క పదం అయినా తన నడతని మంచిగా రాయలేదు.

కొన్ని తప్పులు దిద్దుకోవచ్చు. కొన్ని దిద్దుకోలేని తప్పులు. ఇప్పుడు ఈ పరిస్థితుల్లో తను తన తప్పులు దిద్దుకున్నా ప్రయోజనంలేదు. నేను నా తప్పు తెలుసుకునే సరికి పరిస్థితి విషమించి పోయింది.

కానీ – ఇక్కడ చిత్రమేమిటంటే – తప్పుచేసింది తనయితే శిక్షింపబడింది మరొకరు. అందుకేదీన్ని "కలికాలం" అన్నారేమో! వేమన సహితం తన తప్పుల్ని తెల్సుకుని యోగి అయ్యాడు. తప్పులు చేసిన మనిషే మనీషిగా మారతాడేమో! కానీ తనిప్పుడు మనీషిగా కాకుండా మనిషిగా మారినా ప్రయోజనం????.

ఆఫీసులో వుండగా వచ్చిన ఫోన్ కాల్ అందుకునీ నిర్మలా నర్సింగ్ హోమ్‌కి బయలుదేరాడు. త్రోవంతా డాక్టర్ నిర్మల తన్ని అర్జంటుగా రమ్మని ఫోన్ చెయ్యడానికి కారణాలని వెతుక్కుంటూనే వెళ్తున్నాడు. సరైన కారణం దొరక్క బుర్ర వేడెక్కసాగింది.

పెళ్ళయిన కొత్తలో సుజాత చెప్పింది. తనూ డా.నిర్మలా ఒకే ఊరి వాళ్ళమని, స్కూల్ మేట్సుమనీ. ఎప్పుడన్నా సుజాత ఆరోగ్యం బాగాలేకపోతే ఆమె దగ్గరికి వెళ్ళి మందు పుచ్చుకుంటున్నట్లు తనకి చూచాయగా తెల్సు. "అయితే ఇప్పుడు సుజాతకి ఏదన్నా అనారోగ్యమా? లేక నెల తప్పిందా? ఆ విషయం చెప్పడానికే పిల్చిందా??" అన్న ఆలోచన బుర్రలో కొచ్చినా అదంత పెద్ద విషయం కానట్లు, వేరే ఏదో ముఖ్యమైన విషయమై పిలిచినట్లు డాక్టర్ తనని రమ్మన్న తీరులో అనిపించింది.

డా. నిర్మల రూమ్‌లో కెళ్ళి తన్ని తాను పరిచయం చేసుకోగానే 'ఓ సుజాత భర్తా!' అని ఆమె పలకరించడం గోపాల్‌కి తలకొట్టేసినట్లయింది. 'సుజాతకి ఎంత స్నేహితురాలయితే మాత్రం' – 'ఫలానా ఆవిడ మొగుడివా! అని అడగడం ఏం సంస్కారం?' అనుకున్నాడు. కానీ ఏమీ అనలేక తలవూపి, గుటకలు మింగసాగాడు ఎంతో అవమానంగా ఫీలయిపోతు. "మిస్టర్ గోపాల్! కూర్చోండి" అంటూ కూర్చీ చూపించి – "అయాంసారీ–మిమ్మల్ని ఆఫీసు నుంచి రప్పించవలసి వచ్చింది. మీతో చాలా ముఖ్యమైన విషయం చెప్పాలని ఫోన్ చేసాను. మీ ఆవిడ కొద్ది రోజులుగా నీరసంగా వుందంటూ నాదగ్గరకి వస్తోంది. చాలా వీక్‌గా వుండటమేకాదు, చాలా వెయిట్ కూడా కోల్పోయింది. రెండు రోజులుగా ఆమెకి అన్ని పరీక్షలూ చేస్తున్నాను. ఈ రోజు ఉదయమే వచ్చిన రిపోర్టులవల్ల ఆమెకి కేన్సర్ అని తెలిసింది. ఆమె ఆరు నెలలన్నా బ్రతకొచ్చు–ఏడాదన్నా బ్రతకొచ్చు. ఈ రోగానికి మందులేదన్న విషయం అందరికీ తెలిసిందే! కానీ కొన్ని ఇంజక్షన్లు, మందులు యిస్తే జీవితకాలం పొడిగించవచ్చు. ఆ మందులకి, ఇంజక్షన్లకి అరవై వేలకి పైనే అవుతుంది. నా చేతిలో ఉన్నంతలో నేను ఫ్రీగా చేస్తాను. నాకు తను చిన్ననాటి స్నేహితురాలు. సుజాతవంటి సౌశీల్యవతికి రావలసిన రోగం కాదది. ఆమె నెమ్మది, మంచితనం స్కూలు రోజులనుంచి నాకు తెలుసు. అలాంటి దేవతకి వైద్యం చేసి కొంచెం పుణ్యం సంపాదించాలన్న స్వార్ధంతో నేనీ నిర్ణయం తీసుకున్నాను. భర్తగా మీకు ఆమె మంచి తనం గురించి నాకన్నా ఎక్కువే తెలిసి వుంటుంది. లక్షలు ఖర్చు చేసైనా అలాంటి వ్యక్తిని కాపాడుకోవడం మీ ధర్మం, కర్తవ్యం అని నేను వేరే చెప్పనవసరంలేదు. మీరు వెంటనే డబ్బు ఏర్పాటు చేస్తే నేను వైద్యం ప్రారంభిస్తాను" అన్న డాక్టర్ మాటల్ని వింటున్న గోపాల్ శరీరం మంచుగడ్డలా బిగుసుకు పోసాగింది. ఆమెకి ఏం జవాబివ్వాలో తోచటంలేదు. కరెంటు వైరు చుట్టుకున్నట్లు శరీరమంతా తిమ్మిరెక్కి పోసాగింది. అచేతనంగా ఆమెనే చూస్తూ వుండిపోయాడు. ఆ సెకనులో ఏదో మార్పు అతన్ని చలింపజేసింది.

కొంతసేపటి తరవాత లేచి వెళ్ళబోతున్న గోపాల్‌ని చూస్తూ "చూడండి గోపాల్‌గారూ! ఈ విషయాలేవీ సుజాతకి తెలియనివ్వకుండా వుంచడం మంచిది. రెస్టుకావాలని నా నర్సింగ్ హోమ్‌లో చేర్చుకుని స్పెషలిస్టుల చేత వైద్యం చేయిస్తాను. మరో విషయం, మీరు డబ్బు తెచ్చి నాకివ్వండి. ఆమె ఎదురుగా మందులు తెస్తే 'ఎందుకు? దేనికి?' అని అడగొచ్చు. నేనయితే ఏ అనుమానం రాకుండా ఏదో చెప్పి వైద్యం చేస్తాను. త్వరంగా వైద్యం ప్రారంభించడం మంచిది. కేన్సర్‌లో కూడా అనేక రకాలు. రేపిడ్ గ్రోత్‌వి కొన్ని వుంటాయి. సో–వెంటనే డబ్బు ఏర్పాటు చెయ్యండి. రేపు ఆమెని ఎడ్మిట్ చేసుకుంటాను. ఇంకో సంగతి ఏమిటంటే ఆమెకి కొన్ని చెడురోగాలు కూడా వున్నాయి. అవి ఎలా సంక్రమించాయో తెలీదు. దానికీ వైద్యం చెయ్యాలి" అంటూ లేచింది.

డా॥ నిర్మల చెప్పిన మాటలే యిప్పుడు గోపాల్‌నింత మానసిక వేదనకి గురిచేసాయి. సిగ్గుతో మనసు చితికిపోతుంది.

ఎంత రాతిగుండెగల మనిషికయినా ఏదో ఒక రోజు, ఏదో ఒక సంఘటన సూటిగా గుండెకి తగిలి పాషాణంలాంటి ఆ గుండెని కరిగించేస్తుంది. డైనమైట్లకన్నా శక్తివంతమైనవి కొన్ని సంఘటనలు. అవి కొందరి జీవిత గమనాల్నే మార్చేస్తాయి. అదే జరిగింది గోపాల్ విషయంలో.

ఆడదంటే గోపాల్‌కి లోకువేంకాదు. అలా అయితే అమ్మ, తోబుట్టువుల్ని ప్రాణపదంగా చూసుకునేవాడుకాదు. ఆడదంటే చిన్న చూపు వుండి వుంటే తనతో 'సై' అనే ఆడవాళ్ళ ఇళ్ళకి, వేశ్యల దగ్గరకి వెళ్ళి ఈనాడు ఆస్తి అంతా అమ్ముకుని, అప్పులపాలయి వుండేవాడు కాదు. అతనికి లోకువల్లా కట్టుకున్న భార్యే! పెళ్ళాంగా వచ్చింది గనక ఓ కీలుబొమ్మలా ఆడాలి. తండ్రి దాన్ని పెంచలేక నా ఇంటికి పంపేడు గనక, నేను తిండి పెడుతున్నాను గనక నా యిష్టప్రకారం నడవాలి. ఓ పనిమనిషిగా, వంట మనిషిగా, అవసరం వచ్చినప్పుడు పెళ్ళాంగా పడుండాలంతే! ఈ భావంతోటే పెళ్ళయిన పదేళ్ళనుంచి ఆమెపట్ల ప్రవర్తించాడు. "డిగ్రీవున్నా మూడోక్లాసు పాసవని మనిషిలా తన వ్యక్తిత్వాన్ని చంపుకుని ఆ ఇంట్లో మసలుకున్నా నాకేనాడూ జాలి, కనికరం అనే పదాలకి అర్థం తెలీకుండా సుజాతపట్ల మసిలాను. నోట్లో నాలికలేని మనిషిలా, అన్నింటికీ తలూపుతూ ఇన్నేళ్ళపాటు నడచుకుందా యిల్లాలు.

ఇల్లుగుల్ల చేసి పరాయి స్త్రీలకి పెట్టేను. పరాయి స్త్రీలకి ఇవ్వడానికి సుజాత వంటినున్న నగలని అడిగినప్పుడు, బేలగా చూస్తూ అన్నీ ఒలిచి యిచ్చేసినప్పుడు కూడా నాకు 'పాపం' అని అనిపించలేదు.

దానికన్నా దారుణం నెల్లాళ్ళుగా ఆరోగ్యం సరిగ్గా లేదని చెప్పబోయినా నన్ను కానట్లు పట్టించుకోకుండా వెళ్ళిపోయాను. అంటే-ఇంక రోగం సహనశక్తిని తినేస్తే సుజాత స్నేహితురాలి వద్దకి మందుకెళ్ళిందన్నమాట. డాక్టర్ హృదయంలో సుజాతకి ఎంతగొప్ప స్థానం వుంది! ఆమె దృష్టిలో సుజాత ఎంత ఉత్తమురాలు! చిన్ననాటి స్నేహితురాలికున్న ప్రేమాభిమానాల్లో పదోవంతయినా పదేళ్ళపాటు ఇల్లు, ఒళ్ళు నాశనం చేసుకుని చాకిరీ చేసిన భార్యపై నాకు లేదుకదా?" అనుకున్నాడు. డాక్టర్ చివరిలో ఆడిన ఒక్కోమాట సమ్మెటపోట్లల్లా సూటిగా తన హృదయానికి తగిలి తునాతునకలు చేస్తోంది.

"ఛీ-ఎందుకీ జన్మ!? ఎందుకు నేనింతకాలం ఇంత హీనంగా ప్రవర్తించాను?? ఇంట్లో వున్న వ్యక్తి ఔన్నత్యాన్ని గ్రహించలేకపోయాను. భార్య దగ్గర లేనిది పరాయి స్త్రీల దగ్గరేముంది? సుజాతకి అందం లేదా? ఆప్యాయత పంచి యివ్వలేదా? ఇంట్లో వున్న పంచభక్ష్య పరమాన్నాలని కాల దన్నుకుని, వీధిలో కుక్క కూటికి ఎందుకెగబడ్డాను? కొద్ది క్షణాల పాటు బైటస్త్రీలతో పొందే సుఖం కోసం నా ఇల్లు నాశనం చేసుకున్నాను. ఇప్పుడు వారిలో ఏ ఒక్కరయినా తన సుజాత ప్రాణాన్ని కాపాడతారా? ఆమె జీవితాన్ని పొడిగించడానికి ఒక్క పది రూపాయలిస్తారా? ఇన్ని బాధల్ని పెట్టినా, హింసించినా నోరెత్తకుండా ఈ ఇంటినే

అంటిపెట్టుకుని పడివుంది. అసలు ఆ మనోవ్యాధే ఆమెకీ రోగానికీ కారణమా? అంటే సుజాత చావుకి తనే కారకుడన్న మాట – హే భగవాన్! తప్పు చేసిన నీచుడిని నేనయితే నన్ను వదిలేసి అమాయకురాలైన సుజాతకెందుకీ శిక్ష విధించావు?" అంటూ బాధపడసాగాడు.

"ఏయ్! ఎవరక్కడ? పది దాటింది, గేట్లుమయ్యాలి" అంటూ పార్కు చప్రాసీ కర్రతో బెంచీమీద కొట్టగానే ఈ లోకంలో కొచ్చిన గోపాల్ వందకిలోల బరువు కోల్పోయిన వ్యక్తిలా నీరసంగా నడుస్తూ ఇంటిత్రోవ పట్టాడు.

అన్నం వడ్డిస్తున్న సుజాతని తలెత్తి చూడలేకపోతున్నాడు. ఇంటికొచ్చిన దగ్గర నుంచి డాక్టర్ మాటలు తనని మరీ కృంగదీస్తున్నాయి. దాంతో సుజాతని తప్పించుకుని తిరగసాగాడు. ఆమె కనబడితే మృత్యువు రాక్షసిలా ఆమె పక్కనే నిలబడ్డ భావం కలిగి మనసు విలవిల్లాడి పోతోంది. ఆమె వెనక నేలమీద నీడని చూస్తుంటే సుజాతని వెంటాడుతున్న యమపాశంలా అనిపించి భయంతో శరీరం వణకసాగింది. తనకి తెలీకుండానే హృదయం ఆవేదనతో రోదించి కన్నీటిబొట్లు జలజలా రాలసాగాయి. సుజాత ఇంక ఈ ఇంటికి కొద్ది నెలల చుట్టమా? ఆమె లేకపోతే ఈ ఇల్లు ఎలాగుంటుంది? "అన్న ఆలోచన రాగానే అన్నం సయించలేదు. లేచి వెళ్ళిపోతున్న భర్తని అన్నం వదిలేసి వెళ్తున్నారేం?" అని అడిగే ధైర్యం లేక తనూ లేచి పన్లు ముగించుకుని పడుకుంది సుజాత.

పడుకున్న గోపాల్‌కి "అంత డబ్బు ఎక్కడినుంచి తేను? ఎవరిస్తారు?" అన్న ఆలోచనే కళ్ళముందు నిల్చి నిద్రని రానివ్వటంలేదు. అమ్ముదామన్న ఇంట్లో ఏం లేవు! ఆఫీసులో అప్పులు తప్ప పి.ఎఫ్‌లో కూడా ఏంలేదు. తన్నీ, తన వ్యసనాలని తెలిసిన వారెవ్వరూ తనకి అప్పివ్వరు. ఇప్పుడు నిజం చెప్పినా నమ్ముతారా?" అన్నదే ఆలోచన, బాధ.

ఏదిఏమైనా నా సుజాత జీవితాన్ని పొడిగించుకోవాలి. బ్రతికినన్నాళ్ళూ సుఖపెట్టాలి కేన్సర్‌కి ప్రారంభదశలో మందులు తీసుకుంటే తగ్గిపోతుందని పత్రికల్లో చదివాను. నా అదృష్టం బాగుండి ప్రారంభదశే అయితే సుజాతకి కూడా తగ్గుతుందేమో! అన్న ఆశ మెదిలింది.

మర్నాడు తల్లి దగ్గరకి వెళ్ళి తనవాటా ఎకరంపొలం అడిగి అమ్మగా వచ్చిన లక్ష రూపాయలు తీసుకెళ్ళి డా. నిర్మలకి యిచ్చాడు. ఎలాగయినా నా సుజాతని బ్రతికించమని కన్నీటితో వేడుకుంటున్న గోపాల్‌ని విచిత్రంగా చూసింది నిర్మల.

"గోపాల్‌గారూ! నా ప్రయత్నం నేను చేస్తాను. ఒక విషయం అడుగుతాను చెప్పండి! ఆమెకి కొన్ని సుఖ రోగాలున్నాయి. ఆమెని నేను స్నేహితురాలిగా చిన్నతనంనుంచీ ఎరుగుదును కానీ....." అంటూ ఆమె చెప్పబోతున్న మాటలకి అడ్డుపడి "డాక్టర్‌గారూ! ఈనాడు సుజాత ఆరోగ్యం యింతలా దిగజారిపోవడానికి కారకుడిని నేనేనండీ! నేనే!" అంటూ తనుచేసిన తప్పుల్ని ఒక్కటొక్కటిగా చెప్పి, ఆమెని కాపాడమని డాక్టర్ పాదాల వద్ద కూర్చుని దుఃఖిస్తున్న గోపాల్‌ని ఊరడించలేదు సరికదా నిర్మల మనసు ఆనందంతో నవ్వి యిలా అనుకుంది.

"అబద్ధం దాగదని తెలుసు. నేనాడిన అబద్ధం బయటపడటానికి కనీసం ఏడాదన్నా పడుతుంది. ఈ ఏడాది కాలం పశ్చాత్తాపంతో కుమిలిపోతాడు. అదే అతనికి పెద్ద శిక్ష. ఆమెను ఈ మధ్యకాలంలో గోపాల్ రాక్షసుడిలా హింసించడం మానేసి మనీషిగా కాకపోయినా మనిషిగానన్నా చూడటం అలవర్చుకుంటే చాలు! గోపాల్‌లో వచ్చిన మార్పునే పశ్చాత్తాపం అంటారు. రోగాలకి వైద్యం చెయ్యడమొక్కటే కాకుండా, కూలిపోతున్న సంసారాన్ని నిలబెట్టడం కూడా డాక్టర్ల కర్తవ్యమే! విధే!

భగవాన్! సుజాత పేషంటుగాకాక, స్నేహితురాలిగా నాతో చెప్పుకున్న తన జీవితకధని విన్నాకే ఆమెకి విమోచన కలిగించాలని ఆడిన ఈ భయంకరమైన అబద్ధాన్ని కొన్నాళ్ళపాటు దాచే బాధ్యత నాదే! నిజం తెలిసే వరకు గోపాల్ యిచ్చిన డబ్బు, ఆమె పేరవేసి దాచి తిరిగిచ్చే పూచీనాది" అనుకుంది మనసులోనే.

డాక్టర్ నిర్మల మనసు ఆమె చేస్తున్న తప్పుని పదే, పదే గుర్తుచేస్తున్నా-

"వంద అబద్ధాలు చెప్పి ఒక పెళ్ళి చెయ్యమన్నారు మన పెద్దలు - ఒక కాపురం నిలబెట్టడానికి ఒక్క అబద్ధం ఆడితే తప్పా??" అని నచ్చజెప్పింది మనసుకి డాక్టర్ నిర్మల.

**- ఢిల్లీ తెలుగు వాణి, డిశంబర్ 1995**